క్లుప్తంగా

అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఏర్పాట్లు

భద్రాచలంటౌన్: భద్రాద్రి వేదికగా మరో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మార్చి నెలలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య యువసేన ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ మూడో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నీలో గెలుపొందిన విజేతకు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.25 వేలు సెమీస్‌కు చేరిన జట్లకు రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల జట్లు టోర్నీ ఎంట్రీ ఫీజు రూ.1200 చెల్లించి నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9493674170, 9014848121 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడా మైదానాన్ని కాపాడాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని అక్రమదారుల నుంచి కాపాడాలని ఏబీఎస్పీ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కళాశాల క్రీడా మైదానాన్ని ఏబీఎస్పీ డివిజన్ నాయకుల బృందం పరిశీలించారు. కొందరు వ్యక్తులు క్రికెట్ పేరుతో మైదానాన్ని ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేశారని, దీనిపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఆయన స్పందన సరిగా లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైదానంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించాలని, లేకపోతే ఏబీఎస్పీ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, తిరుపతిరావు, రామచంద్రయ్య, మురళి, గోవిందు, మల్లు దొర తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం విచారకరం

మణుగూరు రూరల్: ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేయడం బాధాకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని మణుగూరు ఏరియా ఐఎన్‌టీయూసీ బ్రాంచి నాయకులు వెలగపల్లి జాన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ... కమిటీల రద్దుపై ఐఎన్‌టీయూసీ సెక్రటరి జనరల్ ప్రకటన చేయడంతో తప్పుడు మాటలు విని కొంతమంది నేతలు కోపాద్రిక్తులై దిష్టిబొమ్మను దహనం చేశారన్నారు. ఇలాంటి పొరపాట్లు భవిష్యత్‌లో జరగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామన్నారు.

కేంద్రబడ్జెట్‌లో పేదలకు అన్యాయం

బూర్గంపాడు: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు, మధ్యతరగతి ప్రజలకు అన్యాయం జరిగిందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర బడ్జెట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా, పేదలకు ప్రతికూలంగా ఉందన్నారు. నిత్యావసర ధరలు పెరిగి పేదల జీవన ప్రమాణాలు మరింత దిగజారుతాయని పేర్కొన్నారు.

సాయి ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ దత్తశేష సాయిబాబా ఆలయంలో బాబా వారికి గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా అర్చకులు బాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీటీవీ రమణారావు, కెల్లా శేఖర్, వేణు పాల్గొన్నారు.

5న ఐరన్ స్క్రాప్ వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం గ్రామ పంచాయితీ కార్యాలయంలోని ఐరన్ స్క్రాప్‌ను ఈ నెల 5న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ శ్రీనివాస గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ కట్టి పాటలో పాల్గొనవచ్చని, పాట పాడినవారు వెంటనే పూర్తి సొమ్ము వెంటనే చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

5 నుంచి క్రీడా పోటీలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 8వ తేదీ వరకు కళాశాల విద్యార్థులకు 2023–24 క్రీడా మీట్‌లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

అన్నపురెడ్డిపల్లి: గురుకులంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలను ఆయన గురువారం సందర్శించారు. గురుకులంలోని వంట గదిని పరిశీలించి, స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామపాలనపై నిర్లక్ష్యపు నీడ..!

అర్ధంతరంగా నిలిచిన జీపీ నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- పలు చోట్ల ముందుకు రాని కాంట్రాక్టర్లు



పునాదులకే పరిమితమైన అనంతారం పంచాయతీ భవన నిర్మాణం



నిలిచిపోయిన వెంకటాపురం జీపీ భవన నిర్మాణం



స్లాబ్ దశకు చేరిన తాటిగూడెం జీపీ భవనం

కరకగూడెం: పరిపాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం అనుబంధ గ్రామాలు, తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఆయా పాలకవర్గాలు పాత భవనాలు, అద్దె భవనాలు, పాఠశాలల గదుల్లో తాత్కాలిక పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని ఇప్పటివరకు పాలన కొనసాగించారు. పంచాయతీ సమావేశాలు, గ్రామసభలు తదితర కార్యక్రమాలను నిర్వహించడానికి తగిన వసతి లేక నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల చెట్ల కింద, ఆరుబయట సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యమైన రికార్డులు, వివిధ రకాల పుస్తకాలు, తీర్మానాలు, చెక్ బుక్కులు తదితర ఎంబీ రికార్డులను ప్రతి పంచాయతీల్లో వినియోగించాల్సి ఉంటుంది. సొంత భవనాలు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారగా, క్షేత్రస్థాయిలో అధికారులు, పాలకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే పాత పంచాయతీల్లో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో నూతన పంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది.

మండలంలో ఇదీ పరిస్థితి...

మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో ఏడు ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా, మరో మూడు భవనాలు పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్మించేలా సుమారు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో తాటిగూడెం, వెంకటాపురం, అనంతారంలో గతేడాదే పనులు ప్రారంభమై ప్రస్తుతం ముందుకు సాగడం లేదు. తాటిగూడెం పంచాయతీ భవనంకు స్లాబ్ వేసిన, వెంకటాపురం పంచాయతీ స్లాబ్ లెవల్ వరకు పనులు వచ్చాయి. కానీ అనంతారం పంచాయతీకు సంబంధించి పునాదుల వరకే పనులు నిలిచిపోయాయి. మిగిలిన చిరుమళ్ల, చొప్పాలా, కొత్తగూడెం, రఘునాథపాలెం, సమత్ మోతె, వట్టంవారి గుంపు, తుమ్మలగూడెం గ్రామ పంచాయతీలో ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు.. అధికారుల నిర్లక్ష్యం..!

పంచాయతీ భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పైన తెలిపిన పంచాయతీల నూతన భవనాలకు నిధులు మంజూరైన నిర్మాణాలు చేపట్టడానికి ఎవ్వరూ కూడా పెద్దగా ఆసక్తి చూపెట్టడం లేదు. ఎస్డీఎస్ డీఎఫ్ నిధులు కారణంగా బిల్లులు రావనే అపోహతో కాంట్రాక్టర్లు పనులు చేయటానికి ముందుకురావడం లేదని ప్రచారం జరుగుతోంది. కాగా కొన్నిచోట్ల పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తయేలా చూడాలని కోరుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



గ్రామ పంచాయతీలకు మంజూరైన నూతన భవనాల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. తక్షణమే ఆగిన నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. తరచు అధికారులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలి.

– జాడి దినేష్, తాటిగూడెం

భవనాలు త్వరగా పూర్తి చేయాలి



గ్రామపంచాయతీ భవనాల పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గతేడాది పనులు ప్రారంభించి నేటి వరకు పూర్తి చేయలేదు. పక్క భవనాలు లేకపోవడంతో గ్రామసభలు, సమావేశాల్లో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– పూజారి వెంకన్న, అనంతారం

త్వరలోనే పూర్తి చేస్తాం..



పనులు ప్రారంభమైన పంచాయతీ భవనాలన్నీ త్వరలో పూర్తయ్యేలా చూస్తాం. ఇంకా ప్రారంభం కానీ చోట పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతాం. కాంట్రాక్టర్లు బిల్లుల విషయంలో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు ముందు త్వరగా పనులు పూర్తి చేస్తే చాలు. సకాలంలో బిల్లులు వస్తాయి.

– బి.శంకర్, ఎంపీడీఓ, కరకగూడెం

బాధ్యతలు చేపట్టిన సీఐ



సీఐ అశోక్

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం సీఐగా బొడ్డు అశోక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... మండలంలో పనిచేసే అవకాశం లభించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. మండలంలో జరుగుతున్న సంఘ విద్రోహ కార్యకలాపాలను అరికట్టేందుకు శాంతిభద్రతలను కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అన్నపురెడ్డిపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో గురువారం బోటని ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 47 మంది విద్యార్థుల హాజరైనట్లు ఛీఫ్ సూపరిండెంట్ కే.శ్రీనివాస్ తెలిపారు. ఎగ్జామినర్‌గా ఎం.భాగ్యమ్మ వ్యవహరించారు.

సమస్యలపై సీఎంకు వినతి

చండ్రుగొండ: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు సీఆర్‌పీల యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాణోత్ సేవియా తెలిపారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎంను కలిసి సమస్యను వివరించామని సీఎం సానుకూలంగా స్పందించారని సేవియా గురువారం తెలిపారు. అనంతరం యూనియన్ నూతన డైరీని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారన్నారు.

భారీ వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి



స్టిక్కర్లు అంటిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

భద్రాచలంటౌన్: భారీ వాహనాలకు ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు కచ్చితంగా ఉండాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలలో భారీ వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు రేడియం స్టిక్కర్లు అంటించారు. అనంతరం ఎస్సై లారీ అసోసియేషన్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, లారీ ఓనర్స్, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం వడ్డిస్తున్న వైస్ ఎంపీపీ, హెచ్‌ఎం

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు ప్రారంభించి విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాసవీ క్లబ్ ద్వారా పాఠశాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. హెచ్‌ఎం ఉషారాణి, విద్యా కమిటీ చైర్మన్ పాకనాటి శ్రీనివాసరావు, మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అశ్వారావుపేటరూరల్: ఆదర్శ టైలర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం స్థానిక సంత మార్కెట్ ఆవరణలో జరిగిన యూనియన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూనా శ్రీనివాస్, కార్యదర్శిగా విత్తం శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడిగా పాత్రుని అప్పారావు, జాయింట్ కార్యదర్శిగా కొనకళ్ల శ్రీనివాస్, కోశాధికారిగా నాగరాజు ఎన్నికయ్యారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా పచ్చా సత్యనారాయణ, ఆరేపల్లి సాంబశివరావు, ఎస్‌కె.మౌలాలి, వేముల భగవన్నారాయణ, తాడేపల్లి సిద్దు, కమిటీ సభ్యులుగా ఎన్.సత్యప్రసాద్, దేగల సుజాత, గుర్రాల స్వప్న, షేక్ మైబూబీలు ఎన్నికైనట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

శాలివాహన కమిటీ..

మణుగూరు రూరల్: శాలివాహన (కుమ్మరి సంఘం) మణుగూరు మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా నిమ్మనగోటి భిక్షపతి, అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నాపంల్లి కార్తీక్, సంఘం మండల యూత్ అధ్యక్షుడిగా సంగెం గణేష్, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు వెంకటేష్, కోశాధికారి నిమ్మనగోటి పుల్లారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి చంద్రమౌళి, కె తిరుపతి, జి భద్రయ్య, నాంపల్లి సందీప్, నిమ్మనగోటి పుల్లారావు, ఉపేందర్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మణుగూరు రూరల్: ఖమ్మం,నల్లగొండ,వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల పరిధిలోని పట్టభద్రులందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పీరినాకి నవీన్ అన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కోరుతూ చైతన్య పరిచారు. ఈ నెల 6లోపు కొత్త పట్టభద్రులతో పాటు గతంలో ఓటు హక్కు పొందిన వారు సైతం నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్, అధ్యాపకులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్త పరీక్ష కేంద్రాలను వినియోగించుకోండి



రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

చర్ల రూరల్: మండలంలోని కొయ్యూరు, సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గురువారం నుండి ఈనెల 29 వరకు ప్రతీ మంగళవారం, గురువారం, శనివారాలలో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, పరీక్షల కోసం వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డును వెంట తీసుకురావాలన్నారు.

16న దేశవ్యాప్త సమ్మె



బూర్గంపాడు: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ప్రధాని మోదీ పాలనలో కార్మిక హక్కులకు భంగం వాటిల్లుతుందని, కార్మికచట్టాలను కాలరాస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలోని సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సెగ్గం శ్రీనివాసరావు, మల్లయ్య, వెంకన్న, బిచ్చు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: నిర్మాణ రంగ కార్మికుల చట్టం రద్దుకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి అన్నారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో గురువారం సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయప మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి 1996 చట్టానికి లోబడి ఏర్పాటైన రాష్ట్ర నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును రక్షించుకోవడానికి పోరాటమే మార్గమన్నారు.ఈ సమావేశంలో ఎంబి.నర్సారెడ్డి, జాకీర్, చిన్న రాజు, రాము, మధు, శ్రీను, పాషా తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయండి



భద్రాచలం: మాట్లాడుతున్న రాంప్రసాద్

భద్రాచలం: భద్రాచలంలో శనివారం జరిగే బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని పార్టీ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, తదితరులు హాజరవుతారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీను గెలిపించేందుకు దిశా నిర్దేశం చేసే ఈ సమావేశంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండలాధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు, ఆకోజు సునీల్ కుమార్, తాండ్ర నరసింహారావు. కోటగిరి ప్రబోధ్ కుమార్, కోలా రాజు, డానియల్ ప్రదీప్, కాపుల నవీన్ ఉన్నారు.

మణుగూరులో..

పినపాక: బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... శనివారం మణుగూరు మండలంలో నియోజకవర్గ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఎంపీటీసీలు చింతపంటి సత్యం, జహంగీర్ పాల్గొన్నారు.

కరకగూడెం: పేద ప్రజల పక్షాన అండగా నిలబడి వారి సంక్షేమం కోసం పోరాడేదే బీఆర్ఎస్ పార్టీనేనని పార్టీ మండలాధ్యక్షుడు రావుల సోమయ్య అన్నారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుడగం రాము, ఉపాధ్యక్షుడు పోగు వెంకటేశ్వర్లు, బూర్గంపాడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొమరం రాంబాబు, పెదరామలింగం, సాంబశివరావు, బైరిశెట్టి చిరంజీవి సతీష్, నరసింహారావు, చిట్టిమల్ల ప్రవీణ్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, సిద్ధి సునీల్ పాల్గొన్నారు.



పినపాక: మాట్లాడుతున్న సతీష్ రెడ్డి



కరకగూడెం: మాట్లాడుతున్న నాయకులు

‘భగీరథ’ నీరు కలుషితం



ట్యాంకు దగ్గర తీసి వదిలేసిన గొయ్యి

దుమ్ముగూడెం : మండలంలోని రేగుబల్లి వాటర్ ట్యాంకు దగ్గర గత రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు కలుషితమవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రేగుబల్లి వాటర్ ట్యాంకు దగ్గర పైప్‌లైన్ పగిలి తాగు నీరు కలుషితమవుతున్నాయి. సంబంధిత అధికారులకు సమాచారం అందచేస్తే నామమాత్రంగా గోతులు తీసి వదిలేశారని పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. తాగేనీరు కళ్ల ముందు కలుషితం అవుతుంటే ఎలా తాగగలం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంచాయతీ పాలకవర్గాలకు సన్మానం



మణుగూరు రూరల్: సర్పంచులు, ఉపసర్పంచులను సన్మానిస్తున్న అధికారులు



పినపాకలో..



అశ్వారావుపేటరూరల్: సర్పంచ్ దంపతులకు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని సన్మానించారు. స్థానిక కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌజ్ ఆవరణలో సర్పంచ్ నార్లపాటి సుమతి దంపతులు, ఉప సర్పంచ్ టి.జగన్నాథం, వార్డు సభ్యులను శాలువా కప్పి జ్ఞాపికలు అందించారు. ఎంపీడీఓ జీ.శ్రీనివాసరావు, ఎంపీఓ సీతారామరాజు, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పినపాక: మండలంలోని సర్పంచులకు మండల పరిషత్ ఆఫీసు ఆవరణలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ వెంకటేశ్వరరావు సర్పంచులకు సన్మానం నిర్వహించి జ్ఞాపిక అందజేశారు.

అశ్వాపురం: మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, నాయకులు ఈదర సత్యనారాయణ, కందుల కృష్ణార్జున్‌రావు, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నేలపట్ల సత్యనారాయణరెడ్డి, వెంకటరామయ్య, నక్కనబోయిన పాపారావు, జిలాని, శివాజీ, పున్నరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యులకు ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు ఆత్మీయంగా ఘన వీడ్కోలు పలికారు. సమితిసింగారం గ్రామపంచాయితీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ బచ్చల భారతి, ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, వార్డు సభ్యులను, గుట్టమల్లారం రైతువేదికలో సర్పంచ్ కారం ముత్తయ్య, ఉపసర్పంచ్ కణితి జ్యోతి, సాంబాయిగూడెం జీపీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ కాయం తిరుపతమ్మ, ఉపసర్పంచ్ పెంటుమియా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ చంద్రమౌళి, జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీపీల్లో ‘ప్రత్యేక’ పాలన

అశ్వాపురం/అన్నపురెడ్డిపల్లి/కరకగూడెం/అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీల పాలకమండలి పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్ల పాలన కోసం గెజిటెడ్ అధికారులను నియామకం చేస్తూ కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పదవీ కాలం ముగియడంతో ఇప్పటికే ఆయా పంచాయతీల సర్పంచుల నుంచి కార్యదర్శులు డిజిటల్ కీ, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నేడు ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టనుండగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది.